**కథ**

# మార్పు

## "నిశ్చితార్థం నాడే మా కోడలు సౌమ్యకు రెండు షరతులు పెట్టానే సావిత్రీ" అంది రమణమ్మ.

సావిత్రి, రమణమ్మ మేనత్త మేనమామ పిల్లలు. ఒకే వయసు వాళ్లు. సావిత్రి, భర్త హైదరాబాదులో కొడుకు, కోడలుతో వుంటున్నారు. నడి వయసులోనే భర్తను కోల్పోయిన రమణమ్మ కొడుకు దగ్గర విశాఖపట్నంలో వుంటోంది. చాలా కాలం తర్వాత సావిత్రిగారింట్లో పదిరోజులు ఉండి వెళ్దామని హైదరాబాదు వచ్చింది. ఇద్దరి మధ్య కబుర్లకు అంతు లేకుండా పోయింది.

''ఏమిటే ఆ షరతులు'' అని అడిగింది సావిత్రి కుతూహలంతో.

''చీర తప్ప డ్రెస్సులు వేసుకోకూడదని, స్కూటరు నడపకూడదని, బస్సులోనే ఆఫీసుకు వెళ్లిరావాలని చెప్పాను. నేను పూర్తిగా విశ్రాంతి తీసుకుంటానని, ఇంటి పని, వంటపని తనే చూసుకోవాలని స్పష్టం చేసాను'' అంది రమణమ్మ.

''ఇంటి పని, వంటపని తెముల్చుకుని బస్సులో ఆఫీసుకు టైముకు చేరుకోవటం కష్టమేనే! పోనీ మీ వాడు సౌమ్యను స్కూటరు మీద ఆఫీసు దగ్గర దింపవచ్చు కదా'' అంది సావిత్రి.

''అది కుదరదే! ఎందుకంటే వాళ్లాఫీసులు చెరొక వైపు ఉన్నాయి'' అంది రమణమ్మ.


''పాపం! చాలా కష్టపడుతుందన్నమాట నీ కోడలు'' అంది సావిత్రి సానుభూతిగా. రమణమ్మ కస్సుమంది.

''ఏమిటే కష్టం! మన కాలంలోలాగా మడికట్టుకుని కట్టెల పొయ్యితోను, కుంపట్లతోను అవస్థపడడమా? గ్యాస్ స్టవ్, కుక్కర్, పంపులులాంటి సౌకర్యాలున్నాయి. క్షణాలమీద అన్నీ అవుతాయి'' అంది.

''క్షణాల మీద అవాలన్నా ముందుగా అన్నీ అమర్చుకోవాలి కదే!''

''నువ్వలాగా అనుకోబట్టే పొద్దున్నే పూజ పునస్కారం కూడా చేసుకోవడం మానేసి వంటింట్లో దూరి కోడలికి సాయం పేరుతో ఒళ్లు హూనం చేసుకుంటున్నావు. మీవారికేమో పిల్లల్ని స్కూలు బస్సు ఎక్కించటం, మధ్యాహ్నం దింపి తీసుకుని రావటం పెర్మనెంటు డ్యూటీ అయిపోయినట్టుంది. నాలుగు రోజులు ఊరుకుంటే సరి! వాళ్ల పనులు వాళ్లే చేసుకుంటారు'' అంది రమణమ్మ.

''మావారికి పిల్లల్ని ఒక్కరోజు దింపకపోయినా వెల్తిగా వుంటుందే! పిల్లలు కూడా వాళ్ల తాతగారితో వెళ్లటానికే ఇష్టపడతారు. ఇక నా సంగతి అంటావా? పది గంటలకల్లా ఆఫీసులో వుండవలసిన పిల్ల వంటింట్లో ఒక్కర్తీ అవస్థ పడుతూ వుంటే పూజ పేరుతో పట్టనట్టు కూర్చోవటానికి మనస్కరించదే! అందుకే చేతనైన సాయం చేస్తూంటాను. పని కొంచెం ముందుగానే తెమలకటం వల్ల మా శారద ఆఫీసుకు బయలుదేరే టైముకే అలసిపోదు. ఉద్యోగం బాగా చెయ్యగలుగుతోంది'' అంది సావిత్రి.



**జి. సరస్వతి**

''మీరలాగ సాయం చేస్తూ మెత్తగా ఉండబట్టే ఆ పిల్లకు మీరంటే బొత్తిగా భయం భక్తీ లేకుండా పోయాయి. ఇద్దరు పిల్లల తల్లయింది కదా! మీరంటే ఏమాత్రం గౌరవం ఉన్నా పంజాబీ డ్రెస్సులు, మేక్సీలు వేసుకుంటుందా? మగరాయుడిలా స్కూటరు నడుపుతుందా?'' అంది

రమణమ్మ చేతులు తిప్పుతూ.

''చీర కట్టుకోనంత మాత్రాన, స్కూటరు నడిపినంత మాత్రాన భయంభక్తీ గౌరవం లేవని అనుకోవడం పొరపాటే రమణమ్మా! సౌకర్యం కోసం డ్రెస్సులు, మేక్సీలు వేసుకున్నా శారద సమయం సందర్భం తెలిసిన పిల్ల. పండగ రోజుల్లోను, కోవెలకు వెళ్లేటప్పుడు లక్షణంగా చీరకట్టుకుని ముస్తాబవుతుంది. పెత్తనం చెలాయిద్దామన్న తాపత్రయంతో ఆంక్షలు పెట్టేననుకో! కాదనలేక చెప్పినట్టు నడుచుకున్నా మనసులో కోపం పెట్టుకుంటుంది.

దానికి తోడు తోటి ఆడవాళ్లు అత్త పెత్తనానికి తలవంచే రోజులు పోయాయని పదేపదే చెప్తూ వస్తారు. అగ్నికి ఆజ్యం పోసినట్టవుతుంది. సంసారంలో కలతలు బయలుదేరుతాయి. అవి వేరు కాపురానికి దారి తీసినా ఆశ్చర్యపడక్కర్లేదు. ముసలి కాలంలో పిల్లలు అభిమానం, అండదండలు లేనిదే బ్రతగ్గలమా చెప్పు'' వినటానికి చేదుగా ఉన్నా సావిత్రి మాటల్లో నిజాన్ని కాదనలేకపోయింది రమణమ్మ.

''మనం ఎక్కువగా చదువుకోకపోయినా ఉద్యోగాలు చేయకపోయినా మన పిల్లలకు వాళ్లు కోరుకున్నట్టు బాగా చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న ఆడపిల్లలతో పెళ్లిళ్లు జరిపిస్తున్నాం. అంటే కాలంతోపాటు మనం కొంత ముందుకు వెళ్లినట్టే కదా! మళ్లీ వెనకటి తరం అత్తగారిలాగా ఆలోచిస్తూ కోడల్ని చెప్పుచేతల్లో పెట్టుకోవాలని చూస్తే కోరి కష్టాలు తెచ్చుకున్నట్టే! మన బాధ్యతలు తీరిపోయాయి కనుక వాళ్ల సంసారాల్లో జోక్యం చేసుకోకుండా, చెయ్యగలిగిన సాయం చేస్తూ ప్రశాంతంగా ఉంటే మన పెద్దరికానికి విలువ, గౌరవం ఉంటాయే'' అంది సావిత్రి.

తమను ప్రాణంగా చూసుకుంటున్న శారదలో తప్పులెంచి మనసును కలుషితం చెయ్యటానికి ప్రయత్నిస్తున్న రమణమ్మకు బ్రెయిన్ వాష్ చెయ్యటం అవసరమనుకుందామె. అంతేకాదు, తన మాటల వల్ల రమణమ్మలో మార్పు వచ్చి కోడలి సాధకబాధకాల్ని అర్థం చేసుకుని చేతనైన సాయం చెయ్యటం మొదలుపెటితే కోడలు కూడా సుఖపడుతుంది. అత్తగారి మీద అభిమానం, గౌరవం పెంచుకుంటుంది అనుకుంది.

★ ★ ★

రమణమ్మ ఊరికి బయలుదేరే రోజున ఆటోలు స్ట్రయికు చేశాయి. సావిత్రి గారింటి నుంచి రెండు బస్సులు మారితే తప్ప స్టేషనుకు చేరుకోలేరు. కిటకిటలాడుతున్న బస్సులో రమణమ్మను సామానుతో ఎక్కించి స్టేషనుకు చేర్చటం కష్టమని ఆలోచించిన శారద హాఫ్ డే సెలవు తీసుకుని ఇంటికి వచ్చింది. రమణమ్మ సూట్‌కేసు, బ్యాగు స్కూటరు ముందు సర్దింది. రమణమ్మను వెనకాల కూర్చోబెట్టి జాగ్రత్తగా తీసుకుని వెళ్లి రైలులో కూర్చోబెట్టింది. అరటి పళ్లు, మంచినీళ్ల బాటిలు కొని ఇచ్చింది.

''జాగ్రత్తగా వెళ్లండి పిన్నిగారూ! చేరగానే ఫోను చెయ్యండి. అందర్నీ అడిగినట్టు చెప్పండి'' అంటూ రైలు కదిలేవరకు ఉండి వీడ్కోలు చెప్పింది. శారద చూపిన అభిమానానికి, ఆదరణకు రమణమ్మ కళ్లు చెమర్చాయి. పంజాబీ డ్రెస్సులు వేసుకుని స్కూటర్లు నడిపే ఆడపిల్లలు పొగరుబోతులని, పెద్దవాళ్లను లక్ష్యపెట్టరని అపోహపడుతూ వచ్చింది తను. కానీ ప్రేమాభిమానాలు, గౌరవం, వినయ విధేయతలు స్వభావానికి సంబంధించినవేకాని వాటికి కట్టుబొట్టుతో సంబంధం లేదని గ్రహించలేకపోయింది. వెనకటి తరం అత్తగారు ఈ తరం కోడలు విచక్షణతో ప్రవర్తిస్తే సంసారాలు ప్రశాంతంగా సాగిపోతాయి- అనుకుంది రమణమ్మ.

★ ★ ★

హైదరాబాదు నుంచి అత్తగారు తెచ్చిన చుడీదార్ వేసుకుని అత్తగారి పాదాలకు నమస్కరించింది సౌమ్య.

'సావిత్రి చలవ వల్ల ఇంత కాలానికి సౌమ్యను అర్థం చేసుకోగలిగాను' అనుకుంది రమణమ్మ విప్పారిన మొహంతో నవ్వుతున్న సౌమ్యను చూసి.

టిఫిను బాక్సు, పర్సు తీసుకుని స్కూటరెక్కి 'బై' చెప్పి ఆఫీసుకు బయలుదేరిన సౌమ్య వంక తృప్తిగా చూసి లోపలికి నడిచింది రమణమ్మ.

## మారినతీరు

**తో**టితారల జోరు ఎక్కువైతే అనుకోకుండా మిగిలిన తారల వైఖరిలో మార్పు వస్తుంది. అగ్రశ్రేణి హీరోల సినిమాల్లో హీరోయిన్‌గా చేస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్న శ్రియని చూసి ఆర్తీ అగర్వాల్ తన తీరుని మార్చేసుకుంది. కేవలం గ్లామర్ డాల్‌గా కాకుండా మంచి పెర్ఫార్మెన్స్ ఉన్న పాత్రలు చేయడానికి ఆర్తీ సిద్ధం అవుతోంది. 'గ్లామర్‌కి తగ్గట్టుగా పెర్ఫార్మెన్స్ కూడా ఉంటే తెలుగులో మంచి భవిష్యత్తు ఉంటుంది' అని చెబుతున్న ఆర్తీ అగర్వాల్ దానికి తగ్గట్టుగా ముందుకు వెళుతోంది. ఇండస్ట్రీలోకి వచ్చినప్పటికీ ఇప్పటికీ ఆమె అందచందాల్లో మార్పు బాగా కన్పిస్తోందంటున్నారు. బొద్దుగా ముద్దుగా తయారైన ఆర్తీ మున్ముందు పోషించే పాత్రలు ఎలా ఉంటాయో చూడాల్సిందే.

